# తప్పిపోయిన ఉత్తరం

-కిరణ్‌బాల.

తాతయ్యా వాళ్ళు నిజామాబాద్‌లో ఉంటున్నారు. సెలవుల్లో మేమందరం తాతగారింటికి వెళ్ళటం ఆనవాయితీ.

మా తాతయ్య, అమ్మమ్మ, చిన్న మామయ్య కుటుంబ సభ్యులు, పెళ్ళిళ్ళయిపోయిన మేనమామలూ, పిన్నమ్మలూ, కుటుంబ సమేతంగా వచ్చేవారు సెలవులకి. వేసవి సెలవులైతే మరీ ఉల్లాసంగా గడిచిపోయేవి.

ఈ వేసవి సెలవుల్లోకూడా యధావిధిగా తాతగారింటి కెళ్ళాం.

ఈసారి తాతయ్య వాళ్ళు ఇల్లు మారారు. ముందు గాజులపేటలో ఉండేవారు.

ఇప్పుడు ఖలీల్‌వాడిలో ఓ బంగళా ఇంట్లో రెండో అంతస్థులో అద్దెకుంటున్నారు.

చిన్న పిన్ని కింకా పెళ్ళికాలేదు. పత్రికలకి కథలు రాసేది. చిన్న మామయ్యకి పెళ్ళి కాలేదు. పిన్ని తన కథలన్నీ చిన్న మామయ్యకి చదివి వినిపించేది. అడపాదడపా మాకూనూ!

నేను ఇంటర్ రెండో సంవత్సరం చదూతున్నాను. తమ్ముడు ఎనిమిదో తరగతి, మామయ్య పిల్లలు ఇంకా చిన్న వాళ్ళు. ఇద్దరు పిన్నమ్మల పిల్లలు కూడా దాదాపు మామయ్య పిల్లల ఈడువాళ్ళే.

అమ్మమ్మకి అమ్మ మొదటి సంతానం. మా అమ్మకీ నేను మొదటి సంతానాన్నే. వెరసి ఇంటికి వచ్చేవాళ్ళు నన్ను తాతయ్య కూతురుగా భావించటం కద్దు.

చిన్నపిన్ని మావూరికి వస్తే కొత్తవాళ్ళు పిన్నిని మా అమ్మ కూతురేమో (అంటే నేనని) నని భ్రమించటమూ జరిగేదిలెండి.

ఇంతకీ నే చెప్పేదేంటంటే పిన్నికీ నాకూ కేవలం నాలుగైదేళ్ళే తేడా అనీ.


ప్రతిరోజూ పోస్టుకోసం ఎదురుచూసేది పిన్ని. వచ్చిన ఉత్తరాల్ని ఎవరివి వారికి అందించేది.

ఓ రోజున ఓ ఉత్తరమొచ్చింది, 'రవి శంకర్' అనే పేరు మీద. ఆ పేరు గల వాళ్ళెవ్వరూ ఇంట్లోలేరు.

ఆ ఉత్తరం పట్టుకొని పిన్ని వంటింట్లో కొచ్చింది.

"రవి శంకరెవరమ్మా?" అని అమ్మమ్మ నడిగింది.

అమ్మమ్మ పిల్లలందరికీ భోజనాలు వడ్డిస్తోంది. కూనింటి అడ్రస్‌కి ఎవరో అపరిచిత వ్యక్తి పేరన ఉత్తరం రావటంతో అందరికీ ఆశ్చర్యమేసింది.



ఉత్తరానికి ఫ్రం అడ్రస్ లేదు. 'పోస్టుముద్ర' సరిగా కనిపించలేదు.

చివరికి అంతా కలిసి నిర్ధారణ చేసుకొన్న అసలు విషయమేమిటంటే...తాతయ్యా వాళ్ళు రాకముందు ఈ

ఇంట్లో రవిశంకర్ ఉండేవాడనీ ఆ వ్యక్తి ఖాళీ చేసి వెళ్ళిపోయిన విషయం తెలీక ఈ ఉత్తరం వచ్చిందనీనూ.

పిన్ని ఆ ఉత్తరాన్ని ఉల్లిగడ్డల బుట్టలో పడేసింది. అందరూ కాసేపు నవ్వుకున్నాం.

ప్రతిరోజూ అమ్మావాళ్ళు ఉల్లిగడ్డల బుట్టలో ఉత్తరాన్ని చూసేవారు.

ఓరోజు పిన్ని "చింపి చదూదామే అక్కయ్యా!" గోముగా అంది అమ్మతో.

"పరాయి వాళ్ళఉత్తరం మర్యాదలేకుండా చదవటమేంటి?"

అమ్మా, అమ్మమ్మా కోప్పడ్డారు.

"మరి ఎన్నిరోజులిలా ఉంటుందేమిటి?" సాగదీసింది పిన్ని.

"ఎవరో ఒకరొచ్చి తీసుకెళ్తారేమోలే" అంది అమ్మ.

అంతటితో ఆ ఉత్తరం సంగతి పాతబడిపోయింది.

ఇక తాతగారింట్లో ప్రతిరోజూ ఉదయమే గిన్నెడు కాఫీ దిగాలి.

ఆ తర్వాత ఓ పెద్ద గిన్నెడు ఉప్మా.

లేదంటే ఓ యాభై చపాతీలూ, కాదంటే ఓ ముప్పాతిక పూరీలూ సిద్ధం కావలసిందే!

భోజనాలయ్యాక మధ్యాహ్నాలు అందరూ కాస్త కునుకుతీసేవారు. పిన్నితో సహా వంటింట్లో చేరి పిల్లలందరం కథలూ, కబుర్లూ చెప్పుకునే వాళ్ళం.

ఓ మధ్యాహ్నం విశాలమైన ఆ వంటింట్లో చీపిరి చిమ్మేసి, పెద్ద జంపఖానా పరిచేసి కూర్చున్నామంతా. పిన్ని దృష్టి ఉల్లిగడ్డల బుట్టమీద పడింది. మనది కాని ఉత్తరమొచ్చి అప్పటికే పదిరోజులైపోయింది.

"ఎవరో పాపం ఆ రవి శంకర్?" అభినయిస్తూ, వ్యంగ్యంగా అంది పిన్ని.

"పిన్నీ! రాసిన వాళ్ళెవరో రిప్లయ్ లేదని బాధపడుత్తున్నారు కాబోలూ" అన్నాన్నేను.

"పోనీ మనం రాసేద్దాం" ఐడియా చెప్పినట్టు గొప్పగా ఫీలయ్యాడు తమ్ముడు.

"చింపి చదివితేనూ....?" కొంటెగా అంది పిన్ని.

"ఓ...ఓ..." దీర్ఘం తీశారు పిల్లలంతా.

వెంటనే కార్యక్రమం కార్యరూపం దాల్చింది.

పిన్ని చెంగున లేడి పిల్లలా గెంతి ఉత్తరాన్ని పట్టుకొచ్చింది.

మఠమేసుకొని కూర్చుంది.

"పరమేశ్వరా! ఈ రవిశంకర్‌కి ఉత్తరమొచ్చి వారం పదిరోజులైపోయాయి. కాబట్టి దీన్ని నేను రిసీవ్ చేసుకుంటున్నాను. పరుల ఉత్తరం చదవటం వల్ల 'పాపం'గానీ అంటుకుంటే, అందులో సగం ముందు రవి శంకర్‌కి పోనీ, దేవుడా! దేవుడా! దేవుడా!" అమ్మమ్మ ఫక్కీలో ప్రార్థన చేసింది పిన్ని.

పిల్లలంతా ఉత్సాహంగా ఉన్నారు.

"రవిశంకర్‌కి సగం పాపం ఎందుకు పిన్నీ" అన్నాను అర్థం కాక.

ఇంకా ఉత్తరం చింపలేదు. దాన్ని చేత్తో పట్టుకొని గాల్లో నలువైపులకీ ఆడిస్తూ, చక్రాల్లాంటి తన పెద్ద పెద్ద కళ్ళని కూడా గిరిగిరా తిప్పేస్తూ.

"ఓసి పిచ్చిమొద్దూ! ఇల్లు ఖాళీ చేసి పోయేముందు తన వాళ్ళందరికీ ఫ్రం అడ్రస్‌తో సహా ఉత్తరం రాయాల్సింది. అలాంటి పని ఆ బద్ధకస్తుడు చేసి ఉండడు" అంది.

'అబ్బో! పిన్ని చాలా తెలివైంది. బాగా ఆలోచిస్తుంది అందుకే కథలు రాయగలదు' అనుకున్నాను లోలోపల.

ఉత్తరాన్ని చింపింది పిన్ని.

"ప్రియాతి ప్రియమైన రవిశంకర్‌కి...

చదూతున్నాను వినండ్రా" అంది.

అందరం హుషారుగా, శ్రద్ధగా వింటున్నాం. 'పెన్‌డ్రాప్' సైలెంట్‌గా ఉంది.

"నీకు ఇంతకు ముందే ఓ ఉత్తరం రాశాను"..

'మనం వచ్చి నెలవుతుంటేనూ ఏదీ అందలేదుగా' అంది పిన్ని.

పిల్లలందరం ఘొల్లున నవ్వాం.


"ఈ ఉత్తరం ఎంతో కష్టం మీద రాస్తున్నాను..."

'పాపం!' అంది పిన్ని.

మళ్ళీ మేం నవ్వాం.


"మీ అమ్మ నిన్ను జ్ఞాపకం చేస్తోంది. నీవెప్పుడొస్తావని ఎంతో ఎదురుచూస్తోంది. కనీసం ఎక్కడున్నావో, ఎలా ఉన్నావో తెలుసుకోమని నన్ను పదే పదే అడుగుతోంది'

## కొత్త రేఖ



నలభయ్యేళ్ళు దాటుతున్నా ఇంకా 'గ్లామరస్'గా కనిపించే రేఖ తిరిగి నటిగా విజృంభించాలనే పట్టుదలతో ఉందిట. ఈ మధ్య ఆమె నటించిన చిత్రాలన్నీ దాదాపు ఫ్లాప్ అయ్యాయి. అందాక సరికొత్త రేఖలా కనబడాలనే ప్రయత్నం మొదలెట్టింది. అందులో భాగంగానే రాహుల్ రావైల్ రూపొందించే 'ఇన్సాఫ్' చిత్రంలో ఓ పవర్‌ఫుల్ పాత్రను అంగీకరించిందిట రేఖ. బాలీవుడ్‌కి వచ్చి పాతికేళ్ళవుతున్నా ఇంకా 'ఎవర్‌గ్రీన్'గా ఉండాలనే రేఖ పట్టుదల అభినందించదగ్గదే!

-మౌర్య




కే.సీతారామారావు, అకౌంటెంట్, ఎపిఎస్ఆర్టిసి. ఆర్మూర్-503 224.

'ఈ రవిశంకర్‌గాడు పారిపోయిన బాపతై ఉంటాడు' అంది పిన్ని పసిగట్టినట్టుగా.

మా పిల్లల్లో కుతూహలం పెరిగింది.

నేను పిన్ని వెనకవైపుగా వాలి, ఆ ఉత్తరంలోని అక్షరాల్ని చూశాను. ముత్యాల్లా గుండ్రంగా ఉన్నాయి.

'హాండ్ రైటింగ్ బావుంది కదూ పిన్నీ!' అన్నాను.

తలూపి మళ్ళీ చదవటం మొదలెట్టింది.

"నీ. అడ్రస్ ఎంతో కష్టం మీద తెలుసుకొన్నాను. అమ్మకి చెబుదామనుకున్నా, కానీ చెప్పలేకపోయా. ఈ సమయంలో చెప్పటం వల్ల కష్టమే ఎక్కువ"

"అమ్మో! పాపం భలే కష్టపడిపోతున్నాడు." హాస్య మాడింది పిన్ని.

మళ్ళీ నవ్వులు.

"అమ్మని నీ దగ్గరకి తీసుకురమ్మనవచ్చు. ఆనందం భరించలేక మళ్ళీ 'గుండెనొప్పి' రావచ్చు. అమ్మని ఈ స్థితిలో వదిలి నువ్వేం సాధిద్దామని వెళ్ళావో అర్థం కాలేదు.'

'నే చెప్పలే పారిపోయిన బాపతే' అంది పిన్ని.

'ఎందుకు పారిపోయాడో?' మామ్మయ్య కొడుకు రాజు అన్నాడు.

'తిన్నదరక్క' అన్నాన్నేను రవిశంకర్‌మీద కోపంతో.

అందరికీ ఆ రవిశంకర్ పారిపోయి తప్పు చేశాడనీ, గుండె జబ్బుతో బాధపడుతున్న ఆ అజ్ఞాత తల్లిమీద జాలీ, అతగాడి మీద కోపమూ కలిగాయి.

పిన్ని ఉత్తరం చదువుతోంది.

రవీ! వెంటనే ఒచ్చేయ్‌రా! ఉద్యోగం సద్యోగం మనకి దొరకవ్. ఏదో మనూర్లో మనం కాయకష్టం చేసుకుందాం. నీవొస్తే మీ అమ్మ బ్రతుకుతుందేమో! లేకపోతే..రాయటానికే కష్టంగా ఉందిరా.

ఈసారి 'కష్టం'గా అన్న మాటకి ఎవ్వరమూ నవ్వలేదు. ఆ మాటలో నిజంగా కష్టముంది.

పసివాళ్ళ కళ్ళల్లో నీళ్ళూరుతున్నాయి.

పిన్ని ఉత్తరం చదూతుంటే అందరి హృదయాలూ బరువెక్కుతున్నాయి.

"అమ్మకి వైద్యం చేయించలేక నువ్వెళ్ళిపోయావ్. నువ్వెళ్ళాక మనూరి పెద్దలకి జ్ఞానోదయమయ్యింది. తలా ఓ చెయ్యేసి అమ్మని హైదరాబాద్ తీసికెళ్ళారు."

మా అమ్మ దగ్గరుండి మీ అమ్మని చూసుకొంది. కానీ ఏం లాభం? అమ్మ ఇంకా మనకి దక్కదని డాక్టర్ చెప్పారు.

నీవొస్తే ఏమీ చెప్పలేం! నిన్నుచూసి లేచి తిరుగుతుం దేమో! బ్రతికుండగానే అమ్మని ఏడిపిస్తున్నావ్.

చచ్చే ముందయినా కాస్త మనశ్శాంతి నివ్వు.

ఒరేయ్! నాకయితే ఇద్దరమ్మలని ఎంతో మురిసి పోయా. ఇప్పుడు ఎంత దీలా పడిపోయానో నీకేం తెలుసు?

నీ అడ్రస్ తెలిసాక నేనే వద్దామనుకున్నా. కానీ అమ్మ నన్ను ఒక్క క్షణమన్నా విడవటం లేదు. నాలో 'నిన్ను' చూసుకొని ఊరట చెందుతోంది.

నీ మీద నాకు కోపంగా ఉంది. అమ్మని చంపుకుం టావా? చెప్పరా! వెంటనే బయలుదేరి రా!

నీ

వెంకటరమణ."

ఉత్తరం చదవటం అయిపోయింది. రెండో పిన్ని కూతురు 'నర్తన' వెక్కివెక్కి ఏడుస్తోంది.

ఉత్తరంలోని ఏ వాక్యం ఆ ఏడేళ్ళ పసిదాన్ని ఏడిపించిందో!

దానేడుపు చూసి మామయ్య కొడుకూ బిగ్గరగా ఏడవటం మొదలెట్టాడు.

ఈ సందడికి కాస్తా పెద్ద మామయ్య లేచాడు.

"ఏమైంది? ఏమైందిరా?" అంటూ కేకలు వేశాడు.

పిన్నీ, నేనూ పసివాళ్ళని ఎంత ఊరడించబోయినా, ఊరుకోటంలేదు వాళ్ళు.

అమ్మ లేచి వచ్చింది మా దగ్గరకి.

ఉత్తరం చింపి చదివిన సంగతి తెలిసి, తాతయ్య పిన్నిని కోప్పడ్డారు.

మిగతా వాళ్ళంతా ఆ ఉత్తరాన్ని చదివి సదరు 'రవిశంకర్ తల్లి'కి సానుభూతినీ, ఆ రవిశంకర్‌పై ఆగ్రహాన్నీ ప్రకటించారు.

★ ★ ★

మర్నాడు పోస్ట్‌లో రెండుత్తరాలొచ్చాయి. ఒకటి పెద్ద మామయ్యకి వాళ్ళ బావమరిది రాసింది.

మరో ఉత్తరం చేత్తో పట్టుకొని అందరివద్దకీ వచ్చింది పిన్ని.

"ఉత్తరం ఎక్కడ నుంచీ?" అమ్మ అమ్మమ్మా, పెద్ద పిన్నీ, అత్తయ్యా ఏక కంఠంతో ప్రశ్నించారు.

'మళ్ళీ రవిశంకర్‌కి ఉత్తరం కాదుకదా!' పిల్లలందరం గుండెలు చిక్కబట్టుకొని, చెవులు రిక్కించాం.

గద్గద స్వరంతో పిన్ని.

"రవిశంకర్‌కి...

అమ్మపోయింది" చదివింది.

చావు కబురు ఉత్తరాలు ఇంట్లో ఉంచకూడదని తాతయ్య అంటూంటారు.

పిన్ని చేతిలో ఉత్తరం చిన్న చిన్న తునకలైంది. ఆ తునకలు గాలికి కొట్టుకుపోయాయి.

అందరి కళ్ళల్లో కన్నీళ్ళు!

ఆరోజు ఇంటిల్లిపాదీ 'రవిశంకర్ తల్లి' ఆత్మకి శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ తలస్నానాలు చేశాము.★

---

## "ముక్కుసూటిగా..."

"ఒరేయ్! రామూ రాజుకేమైంది రా?" అడిగాడు రావ్.


"చచ్చాడ్రా?" జవాబిచ్చాడు రాము.

"అరే! ఎలారా?"

"అతగాడు...ముక్కు సూటిగా - వెళ్ళేరకం కదా! నిన్నరైలు పట్టాల మీది నుంచి నడుస్తూ వెళ్తుంటే...అటుగా వస్తోన్న రైలు త్రోసుకెళ్ళిందట పాపం!"

-కస్తూరి సత్తయ్య
ఇ.నం.2-2-122,
అంగడి బజార్
జగిత్యాల్.

---




బుద్దన మస్తాన్ బాబు, ఇ.నం.16/478, జోస్యులవారితోట, చిలకలపూడి, మచిలీపట్నం, కృష్ణా- జిల్లా-521002.